'భవిత' ప్రశ్నార్థకం!

- అందని ఫిజియోథెరపీ సేవలు
- అసౌకర్యాల నడుమ భవిత కేంద్రం నిర్వహణ



బాలుడిని ఆడిస్తున్న ఐఈఆర్పీ



భవిత కేంద్రానికి వస్తున్న ప్రత్యేక అవసరాల పిల్లలు

విశాఖ విద్య: ప్రత్యేక అవసరాల పిల్లల బంగారు భవితకు భరోసాగా నిలిచేందుకు ఏర్పాటు చేసిన 'భవిత కేంద్రాలు' అసౌకర్యాల నడుమ సాగుతున్నాయి. గోపాలపట్నం మండలంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో భవిత కేంద్రాన్ని ప్రారంభించినా ఇంత వరకూ కేంద్రానికి తగిన సౌకర్యాలు కల్పించలేదు. అయితే కొత్తగా ఏర్పాటు చేసిన కేంద్రాలు కావడంతో సర్దుకుపోవాల్సిందేనని అధికారులు ఇస్తున్న మౌఖిక ఆదేశాలతో కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్ల(ఐఈఆర్పీ)కు అవస్థలు తప్పడం లేదు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రత్యేక అవసరాల పిల్లలకు సేవలందిస్తున్నారు.

పాఠశాల భవనంలో..

గోపాలపట్నం మండలానికి సంబంధించి లక్ష్మీనగర్ ఇ-బ్లాక్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని ఓ గదిలో ఏర్పాటు చేశారు. ఇక్కడ 20 మంది వరకు పిల్లలు నమోదు అయ్యారు. కేంద్రానికి 15 మంది లోపే వస్తున్నారు. కేంద్రానికి రాలేని పిల్లల కోసం ఇక్కడ పని చేస్తున్న ఐఈఆర్పీలు ప్రతీ శనివారం నేరుగా వారి ఇళ్లకు వెళ్లి సేవలు అందిస్తున్నారు. అయితే భవిత కేంద్రం నిర్వహణ కోసం కేటాయించిన గదికి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా మరమ్మతులు చేపట్టగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు నిలిపివేయడంతో పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. దీంతో ప్రత్యేక అవసరాల పిల్లలకు అనువైన సౌకర్యాలు లేకుండానే కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

అందని ఫిజియోథెరపీ సేవలు

భవిత కేంద్రం పరిధిలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ సేవలు అందడం లేదు. మానసిక, శారీరక వైకల్యం గల పిల్లలే కేంద్రాలకు ఎక్కువగా వస్తున్నారు. ఇలాంటి వారికి ఫిజియోథెరపీ సేవలు ఎంతో ఉపశమనం కలిగిస్తాయి. భవిత కేంద్రానికి వచ్చే ఫిజియోథెరపిస్టు విధులకు హాజరుకాకున్నప్పటికీ సమగ్ర శిక్ష అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి కేంద్రాల్లో ఫిజియోథెరపీ సేవలు అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

అంబేడ్కర్ మహాశిల్పంపై దాడి అమానుషం



నిరసన తెలుపుతున్న చింతల్లోవ ఎస్సీ సంఘ పెద్దలు

సింథియా: భారత రాజ్యాంగాన్ని నిర్మించిన రూపకర్త బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై కూటమి ప్రభుత్వం నీచరాజకీయాలు చేయడం దారుణమని జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవ గ్రామ ఎస్సీ సంఘం ప్రతినిధులు మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే చర్యలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఎస్సీ సంఘ పెద్దలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడ నగరం నడిబొడ్డున నిర్మించిన అంబేడ్కర్ విగ్రహంపై సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేష్ ప్రోద్బలంతోనే దాడి జరిగిందని ఆరోపించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చింతల్లోవ గ్రామ పెద్దలు అదపాక అప్పారావు, బోని ఈశ్వరరావు, ఎం.సురేష్, డి.అప్పారావు, బి.గురువులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును పునః సమీక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

సింథియా: షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ ట్రైబులను ఏబీసీడీలుగా విభజిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నామని దళితరత్న మాటూరి చిన్నారావు అన్నారు. వర్గీకరణ వ్యతిరేకపోరాట సమితి సమావేశం ఆదివారం ప్రకాష్‌నగర్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమని, దీనిని పునఃసమీక్షించాలని డిమండ్ చేశారు. ఏబీసీడీల వర్గీకరణ బెంచ్‌లో తప్పనిసరిగా ఎస్సీ జడ్జిలు ఉండాలని, వెంటనే తీర్పును ఆపేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ చేయాలనుకుంటే ముందుగా కులగణన చేయాలని, దాని ప్రకారం రిజర్వేషన్ శాతం పెంచాలని డిమాండ్ చేశారు. గాతాడి జగ్జీవన్‌రావు, పట్టా రమేష్, గోపాలరావు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణ సాధికారతపై ఉపన్యాసం



ప్రసంగిస్తున్న సర్గ్ కెప్టెన్ శంభు దత్తా

సింథియా: సాముద్రికా ఆడిటోరియంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఆరోగ్య సంరక్షణ సాధికారతపై ఉపన్యాసం నిర్వహించారు. సర్గ్ కెప్టెన్ శంభు దత్తా ముఖ్య అతిథిగా పాల్గొని ఆరోగ్య సంరక్షణపై తన విలువైన ఉపన్యాసం ఇచ్చారు.ఈ సందర్భంగా రియర్ అడ్మిరల్ రవ్నిష్ సేథ్ భవిష్యత్తులో ఆరోగ్య సంరక్షణ డొమైన్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర ఏవిధంగా ఉండబోతుందో వివరించారు. తూర్పు నౌకాదళ కమాండ్ నుంచి సుమారు 300 మంది అధికారులు, నావికులు కార్యక్రమంలో పాల్గొన్నట్లు నేవీ వర్గాలు తెలిపాయి.

1 నుంచి ఏఐటీయూసీ సమావేశాలు

పెదగంట్యాడ: ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలను వచ్చేనెల 1నుంచి 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరామయ్య తెలిపారు. పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవనంలో ఆదివారం సమావేశాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఉక్కునగరంలో మూడు రోజులు సమావేశాలు జరుగుతాయన్నారు. 3న విశాఖలో సరస్వతీ పార్కు నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ అనంతరం బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి దుర్మార్గం



అంబేడ్కర్ విగ్రహం ముందు కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్, దళిత సంఘాల నాయకులు

విశాఖ విద్య: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా విజయవాడలోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దుర్మార్గంగా వ్యవహించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ డిమాండ్ చేశారు. ఎన్ఏడీ ఫ్లై ఓవర్ వద్ద ఆదివారం రాత్రి దళిత సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కూటమి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అలాంటి విగ్రహం వద్ద దుండగులు అక్కసుతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేరును శిలా ఫలకంపై తొలగించటం హేయమైన చర్య అన్నారు. ఇది అంబేడ్కర్‌ను అవమానించినట్లేనన్నారు. ఇంత జరిగినా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఇలాంటి చర్యలను ప్రజాసామ్యవాదులంతా ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బాలయోగి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఏడీలో హర్‌ఘర్ తిరంగా యాత్ర



ర్యాలీని ప్రారంభిస్తున్న కాశీవిశ్వనాథరాజు

విశాఖ విద్య: బీజేపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్ఏడీలో హర్‌ఘర్ తిరంగా యాత్ర కోలాహలంగా సాగింది. గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ మీదుగా కంచరపాలెం మెట్టు వరకు జాతీయ జెండాలతో పార్టీనాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు తిరంగా యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా భారత్ మాతాకు జై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో యువమోర్చా సిటీ అధ్యక్షుడు ధోని నాగరాజు, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కొక్కిలగడ్డ విజయబాబు, పార్టీ నాయకులు పాలిమేర శ్రీనివాసరావు,, అప్పలరాజు, గణేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

యామిని కృష్ణమూర్తికి ఘన నివాళి



నృత్యకారిణి యామిని కృష్ణ మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీఠం సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం కళాసేవాపీఠం కార్యాలయంలో ప్రముఖ నృత్య కారిణి యామిని కృష్ణమూర్తి చిత్రపటానికి కళా సేవా పీఠం వ్యవస్థాపకుడు నందవరపు సోములు, అధ్యక్షుడు గొరకల రామదాసు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యంలో ఆమె అలుపెరగని కృషి చేశారని, నాట్య సౌరభాలను ప్రపంచ వ్యాప్తం చేశారని కొనియాడారు. ఆమె ద్వారా ఎంతో మంది యువ నృత్య కారులు ఆవిర్భవించారన్నారు. ఆమె చేసిన సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మభూషన్, పద్మ విభూషన్ అందించి తగిన గుర్తింపు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు చందు సుబ్బారావు, కొంతం నూక రాజేశ్వరరావు, భాస్కర్ పాణిగ్రాహి, నారాయణరావు, రామచంద్రరావు, గులిమి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

14న మిగులు సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

నబ్బువరం: అనకాపల్లి, విశాఖ జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలోని 3, అనకాపల్లి జిల్లా పరిధిలోని 5 గురుకులాల్లో 5వ తరగతితో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 14న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. 5వ తరగతి ప్రవేశం కోసం 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం పదో తరగతి ఉత్తీర్ణత పత్రం, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలోని గురుకులంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 0891- 2799641 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉత్తర్వుల ప్రకారం వేతనాలు చెల్లించాలి



సంఘీభావం తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు

అగనంపూడి: ప్రభుత్వ ఉత్తర్వులు 36 ప్రకారం భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) కార్మికుల వేతనాలు చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.నూకరాజు, ఉరుకూటి రాజు కోరారు. అగనంపూడి బొర్రమాంబ వనం వద్ద ఏర్పాటు చేసిన యూజీడీ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉత్తర్వుల ప్రకారం యూజీడీ కార్మికులకు వేతనం రూ.24,500 చెల్లించాలని, పదవీ విరమణ, అనారోగ్యంతో మృతి చెందడం వల్ల ఏర్పడిన ఖాళీలను తక్షణం వారి కుటుంబ సభ్యులతో భర్తీ చేయాలని, యూజీడీ కార్మికులను అదే స్థానంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 12వ తేదీన జీవీఎంసీ గాంధీ పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు గొలగాని అప్పారావు, ఎస్.గణేష్, గొల్ల రాము, జె.ఆర్.నాయుడు, ఎస్.నాగరాజు, వై.చిన్నారావు, మీనాక్షి, సత్యవతి, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గాజువాక జోన్ యూజీడీ కార్మికుల సంఘం నూతన కార్యవర్గాన్ని సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.రఘు, పి.మహేష్, ఉపాధ్యక్షునిగా సీహెచ్ఎస్ నాయుడు, కోశాధికారిగా బి.శివశంకర్, కమిటీ ప్రతినిధులుగా జి.శ్రీను, పి.కోటి ఎన్నికయ్యారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

మహారాణిపేట: మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇవ్వాల్సిన రూ. 10 వేలు తక్షణం అందజేయాలని రాష్ట్ర మర పడవల సంఘం మాజీ అధ్యక్షుడు పీసీ అప్పారావు కోరారు. ఈ మేరకు ఆయన నాయకత్వంలో పలువురు మత్స్యకారులు ఆదివారం అమరావతిలో మంత్రి కొల్లు రవీంద్రను కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను అప్పారావు ఈ సందర్భంగా మంత్రితో ప్రస్తావించారు. తుపాను, ఇతర కారణాల వల్ల సముద్రంలో మునిగిపోయిన బోట్లకు నష్టపరిహారం తక్షణం ఇవ్వాలని కోరారు. అనంతరం మంత్రిని సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ఘటనాస్థలిలో మృతి చెందిన దేముడమ్మ (ఇన్‌సెట్) దేముడమ్మ(ఫైల్)

పెందుర్తి: పశువులకు దాణా వేయడానికి కళ్లానికి వెళుతున్న ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో అసువులు భాసింది. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిలో రాంపురం వద్ద జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రాంపురంలో నివాసం ఉంటున్న బండారు దేముడమ్మ(68) ఆదివారం సాయంత్రం పశువులకు దాణా పెట్టేందుకు ఇంటి నుంచి కళ్లానికి బయలు దేరింది. గ్రామం వద్ద ఉన్న హైవే దాటుతుండగా అనకాపల్లి వైపు నుంచి వస్తున్న గూడ్స్ వాహనం ఆమెను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆమె రోడ్డుపై తుళ్లిపడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు దేముడమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



పోటీలో వేసిన చిత్రాలతో విద్యార్థులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం చిత్రలేఖనం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ నెల 12న అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూ బయోస్కోప్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభించిన పోటీల్లో నగరంలోని ప్రభుత్వ పాఠశాలలతోపాటు వివిధ స్కూళ్లకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారి ప్రతిభకు పదును పెట్టి ఏనుగులు, పర్యావరణానికి సంబంధించిన చిత్రాలు వేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మాట్లాడుతూ ఏనుగులపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎఫ్ జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి

- సిబ్బంది అందుబాటులో ఉండాలి
- సీపీ శంఖబ్రత బాగ్చీ
- గోపాలపట్నం పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

గోపాలపట్నం: స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి గోపాలపట్నం పోలీసులకు సూచించారు. ఆదివారం ఆయన గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు దారులతో మాట్లాడారు. వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో కేసుల పరిష్కరించే తీరుపై ఆరా తీశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపవద్దని సూచించారు. స్టేషన్‌లో సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ఫిర్యాదు దారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు. అన్ని రిజిస్టర్లు అప్‌డేటెడ్‌గా ఉండాలని ఆదేశించారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యల గురించి ఆరా తీశారు. పలు సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని సీపీ హామీ ఇచ్చారు. ఇతర సమస్యలు ఉంటే 7995095799 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు. గోపాలపట్నం స్టేషన్ శివారు ప్రాంతాల్లో ప్రతేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు మరింత ఎక్కువగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్టేషన్ పరిధిలో గంజాయి పెడ్లర్స్ ఉండరాదని స్పష్టం చేశారు. విధుల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి నడక పోటీలు



నడక పోటీలను ప్రారంభిస్తున్న డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ రంగారావు, త్రీస్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రాంబాబు

కంచరపాలెం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీస్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వి.రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి నడక పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులు డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ టి.రంగారావు, ఫౌండర్ సూర్యనారాయణ జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ నడకతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం నడకకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. జిల్లా స్థాయిలో 4 కేటగిరీల్లో 135 మంది మహిళలు, పురుషులు నడక పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు ఆగస్టు 15న జరిగే వేడుకల్లో బహుమతులు అందజేస్తామని కార్యదర్శి బలరామ్ తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి వెంకటరావు, జాయింట్ కార్యదర్శి ఇమ్మానియేల్, జాలీ వాకర్ రవీంద్ర బెహరా, బులెటిన్ ఎడిటర్ సత్యనారాయణ, డిప్యూటీ గవర్నర్ అప్పలనాయుడు, మాజీ అధ్యక్షులు, మాజీ గవర్నర్లు ఆర్.ఆర్.మహేశ్వరరావు, టి.రాజు, సుకుమార్, సూర్యారావు, నూకరాజు, వాకృత ఆడబాల సత్యనారాయణ, మాధవధార, మురళీనగర్, సింహాచలం, ఆర్టీసీ కాంప్లెక్స్, ఎంవీపీ ప్రాంతాల నుంచి వాకర్లు పాల్గొన్నారు.

38జే క్రాంతినగర్ వరకు పొడిగింపు



మహిళలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గల్లా చిన్నా

సింథియా: పారిశ్రామిక ప్రాంతంలో 38జే ఆర్టీసీ బస్సు క్రాంతినగర్ వరకు పునఃప్రారంభమైంది. గతంలో 38జే ఆర్టీసీ బస్సు కోరమాండల్ వయా జనతాకాలనీ మీదుగా క్రాంతినగర్ వరకు నడిపేవారు. ఆ సర్వీస్ రోడ్‌లో ఎక్కువగా పాడి పరిశ్రమ చేసుకునే రైతులు ఉండడంతో ఆవులు, గేదెలు తరచూ రోడ్డుకు అడ్డంగా ఉండేవి. దీంతో నిత్యం ఆర్టీసీ సిబ్బందికి పాడి రైతులకు గొడవలు జరిగేవి. దీంతో ఆర్టీసీ డిపో మేనేజర్ ఆదేశాల మేరకు 38జే ఆర్టీసీ సర్వీసును జనతాకాలనీ వరకే నడపాలని ఆదేశించారు. అనంతరం ఈ మార్గంలో ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరించాలని సీపీఐ, సీపీఎం నాయకులు ప్రయత్నించారు. ఎట్టకేలకు ప్రస్తుత ఎమ్మెల్యే గణబాబు, 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా సూచనల మేరకు 38జే ఆర్టీసీ సర్వీసును ఆదివారం పునఃప్రారంభించారు. 38జే సర్వీసును క్రాంతి నగర్ వరకు పొడిగించడంతో గ్రామప్రజలు, స్థానిక మహిళలు కార్పొరేటర్ గల్లా చిన్నాకు అభినందనలు తెలిపారు.

వైభవంగా నృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం నృసింహ హోమం వైభవంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లను అధిష్టింపజేసి పుణ్యాహవచనం, విష్వక్సేన ఆరాధన చేశారు. అనంతరం మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని అర్చకుడు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి వెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. అనంతరం ఆ పవిత్ర జలాలను భక్తులపై చల్లారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

అధిక పెన్షన్ చెల్లించాలని వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ఈపీఎస్-95 సమస్యలు పరిష్కరించాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు కేంద్ర ఈపీఎఫ్‌వో అధికారులను కోరారు. సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్ న్యూఢిల్లీలో అధికారులను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 2 వేల మంది రిటైర్డ్, సర్వీసులో ఉన్న ఉద్యోగులు అధిక పెన్షన్ పొందేందుకు అర్హత కలిగి ఉన్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు 2023 అక్టోబర్-2024 ఫిబ్రవరి మధ్య అధిక పెన్షన్ కోసం రూ. 500 కోట్లు డిపాజిట్ చేశారని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటి వరకు అధిక పెన్షన్ జారీ చేయలేదన్నారు. దురదృష్టవశాత్తు స్టీల్‌ప్లాంట్‌కు చెందిన కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులకు పీపీవోలు జారీ చేసిన తర్వాత కూడా ఇప్పటి వరకు పెన్షన్ పంపిణీ కాలేదన్నారు. ఈ నేపథ్యంలో అధిక పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగులకు పెన్షన్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.